సాక్షి నిజామాబాద్

ఆదివారం । 19 । అక్టోబర్ । 2025



గురుకులాలపై 'ప్రత్యేక' గురి

సాంఘిక సంక్షేమ గురుకులాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతున్నారు.

- 10లో ▸



ఎస్‌హెచ్‌జీలకు మరిన్ని..

మహిళా సంఘాలకు వరి ధాన్యం కొనుగోలు బాధ్యతను విస్తృతం చేశారు. గతం కంటే 37 కేంద్రాలను పెంచారు.

- 10లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 35.3 /19.5

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఎండ ప్రభావం ఉంటుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

తగ్గిన దరఖాస్తులు

- స్వల్పంగా పెరిగిన ఆదాయం
- ఎక్సైజ్ శాఖకు రూ.77.04 కోట్లు



నిజామాబాద్‌అర్బన్ : మద్యం దుకాణాల కేటాయింపునకు స్వీకరించిన దరఖాస్తుల ద్వారా ఎక్సైజ్ శాఖకు మెరుగైన ఆదాయం సమకూరింది. 2025–27 సంవత్సరానికి జిల్లా వ్యాప్తంగా 102 మద్యం దుకాణాలకు సెప్టెంబర్ 26న ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసిన విషయం తెలిసిందే. కాగా, శనివారంతో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ముగిసింది. అర్ధరాత్రి వరకు ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో దరఖాస్తుల స్వీకరణ కొనసాగింది. శుక్రవారం వరకు జిల్లా వ్యాప్తంగా 1,478 దరఖాస్తులు వచ్చాయి. శనివారం రాత్రి 10గంటల వరకు దరఖాస్తుల సంఖ్య 2,568కు చేరింది. ఒక్కో దరఖాస్తుకు రూ.3లక్షల చొప్పున మొత్తం దరఖాస్తులకు రూ. 77.04 కోట్ల ఆదాయం వచ్చింది. గతంలో 3,759 దరఖాస్తులు రాగా రూ. 76 కోట్ల ఆదాయం సమకూరింది. ఇదిలా ఉండగా ఈ నెల 23న నగర శివారులోని భారతి గార్డెన్‌లో మద్యం దుకాణాలకు సంబంధించిన డ్రా కార్యక్రమం నిర్వహించనున్నారు.

రెవెన్యూ సిబ్బందికి డిప్యుటేషన్లు

నిజామాబాద్‌అర్బన్: రెవెన్యూ శాఖలో పలువురు ఉద్యోగులను కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి డిప్యుటేషన్‌పై బదిలీ చేశారు. ఇటీవల రేషన్ కార్డుల జారీలో అనేక అక్రమాలు జరిగినట్లు పౌరసరఫరాల శాఖ కమిషనర్ జిల్లా అధికారులకు నివేదించారు. దీంతో విచారణ చేపట్టిన అధికారులు ఆయా మండలాల్లో అక్రమాలకు పాల్పడిన వారిని గుర్తించారు. అయి తే, వారిపై సస్పెన్షన్ వేటు వేయాల్సి ఉండగా, బది లీలతో సరిపెట్ట డం చర్చనీయాంశంగా మారింది. రెంజల్ తహసీల్ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ గౌతంను జిల్లా కలెక్టర్ కార్యాలయానికి, బోధన్ తహసీల్ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ సుమంత్‌ను జిల్లా కేంద్రంలోని టీజీఎస్‌సీఎస్‌సీఎల్‌కు, ఇందల్వాయి ఆర్‌ఐ దండి మోహన్‌ను టీజీఎస్‌సీఎస్‌సీఎల్‌కు, సిరికొండ ఆర్‌ఐ గంగరాజంను నిజామాబాద్ సౌత్ మండలానికి, ధర్పల్లి ఆర్‌ఐ రవిని ఎడపల్లికి, నిజామాబాద్ సౌత్ మండల ఆర్‌ఐ నవాజ్‌ను బోధన్ తహసీల్ కార్యాలయానికి డిప్యుటేషన్‌పై పంపించారు.

వైద్య కళాశాలకు నాలుగు పీజీ సీట్లు పెంపు

నిజామాబాద్‌నాగారం: నిజామాబాద్ ప్రభుత్వ వైద్య కళాశాలకు పీడియాట్రిక్ విభాగంలో నాలుగు పీజీ సీట్లు పెంచినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణమోహన్, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్ శనివారం తెలిపారు. ఇది వరకే మూడు పీజీ సీట్లు వచ్చాయని, తాజాగా నాలుగు పెంచడంతో ఏడు సీట్లకు పెరిగినట్లు వివరించారు. డెర్మటాలజీ విభాగంలో నాలుగు పీజీ సీట్లు నూతనంగా అందుబాటులోకి వచ్చాయన్నారు. వైస్ ప్రిన్సిపాళ్లు జలగం తిరుపతి రావు, డాక్టర్ నాగమోహన్, డాక్టర్ కిశోర్, హెచ్‌వోడీలు, ఫ్యాకల్టీ, ఆఫీస్ సూపరింటెండెంట్ నాగరాజు సిబ్బంది, సహకారంతోనే సాధ్యమైందని తెలిపారు.

ఎస్సారెస్పీలోకి తగ్గిన వరద



బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు తగ్గుముఖం పట్టింది. ప్రస్తుతం 5,654 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్ట్ నుంచి కాకతీయ కాలువ ద్వారా 4 వేలు, సరస్వతి కాలువ ద్వారా 650, లక్ష్మి కాలువ ద్వారా 200, మిషన్ భగీరథ ద్వారా 231, ఆవిరి రూపంలో 573 క్యూసెక్కుల నీరు పోతోంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1091(80.5 టీఎంసీలు) అడుగులు కాగా శనివారం సాయంత్రానికి అంతే స్థాయి నీటి మట్టంతో ప్రాజెక్ట్ నిండుకుండలా ఉందని అధికారులు తెలిపారు.

నిర్మానుష్యంగా జిల్లా కేంద్రంలోని బస్టాండ్



బీసీ బంద్ విజయవంతం

- నిరసనల్లో పాల్గొన్న వివిధ రాజకీయ పార్టీల నాయకులు
- ఆర్టీసీ బస్‌డిపోల వద్ద బైఠాయింపు
- నగరంలో బైక్ ర్యాలీ

నిజామాబాద్‌అర్బన్ : రాష్ట్ర బీసీ జేఏసీ పిలుపు మేరకు శనివారం జిల్లా వ్యాప్తంగా బంద్ విజయవంతమైంది. ఆర్మూర్, బోధన్, బాల్కొండ తదితర ప్రాంతాల్లో స్వచ్ఛందంగా వ్యాపారస్తులు, ప్రయివేటు పాఠశాలలు బంద్ పాటించారు. ఉదయం 3 గంటలకే బీసీ సంఘాల నాయకులు నిజామాబాద్ ఒకటవ, రెండవ డిపోల ముందు బైఠాయించారు . బస్సులను అడ్డుకున్నారు. కాంగ్రెస్, బీజేపీ వామపక్షాల నాయకులు ఆర్టీసీ డిపో ముందు బైఠాయించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీసీ సంఘల నాయకులు నగరంలో బైక్‌ర్యాలీ నిర్వహించారు. నగరంలో బస్టాండ్ నుంచి పాత కలెక్టరేట్, పులాంగ్ చౌరస్తా బోర్గం(పి) వరకు, అక్కడి నుంచి ధర్నా చౌక్ వరకు వచ్చారు. అనంతరం నిర్వహించిన దీక్ష శిబిరంలో వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు. జిల్లా బీసీ సంక్షేమ సంఘం నాయకులు సుధాకర్, బుస్సా ఆంజనేయులు పాల్గొన్నారు

సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో నగరంలో ర్యాలీ నిర్వహించారు. న్యూడెమోక్రసీ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ద్వారకనగర్ నుంచి బస్టాండ్ రైల్వే స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఆకుల పాపయ్య మాట్లాడుతూ బీసీలు అత్యధిక జనాభా ఉండి కూడా రిజర్వేషన్ ఫలాలను అందుకోలేకపోతున్నారన్నారు.

తెలంగాణ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు మల్లాని శివ మాదిగ పాల్గొని మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ నాయకులు బంద్ కార్యక్రమంలో పాల్గొన్నారు. బోర్గం(పి)లో మాదిగ కుల సంఘాలు, బీసీ సంఘాలు, కాంగ్రెస్ పార్టీ నాయకులతో బంద్ కార్యక్రమం నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ధర్నా చౌక్ వద్ద నిర్వహించిన నిరసన కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నరాల సుధాకర్ పాల్గొన్నారు.

దిష్టిబొమ్మ దహనం

సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథా నాయకులు కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. వనమాల కృష్ణ పాల్గొన్నారు. నుడా చైర్మన్ కేశ వేణు, నరాల రత్నాకర్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి, బీఎల్‌పీ రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు దండి వెంకట్, మహిళా రాష్ట్ర నాయకురాలు సబ్బని లత, మాల మహానాడు నాయకులు గైని గంగారం, దేవిదాస్, సుధాకర్, తెలంగాణ జాగృతి జిల్లా అధ్యక్షులు అవంతి రావు, ప్రజా హక్కుల సంఘం నాయకులు భాస్కర్, పీడీఎస్‌యూ నాయకులు గణేష్, ఆంజనేయులు, గంగకిషన్ పాల్గొన్నారు.



ఒకటవ బస్ డిపో వద్ద బీసీ జేఏసీ నాయకుల ధర్నా



నగరంలో పెట్రోల్ బంకు మూసివేత

బీసీ కులాల జాయింట్ యాక్షన్ కమిటీ

బంద్‌లో భాగంగా బీసీ కులాల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో పాత కలెక్టరేట్ వద్ద నిరసన చేశారు. ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, ఎస్ఎస్ఆర్ విద్యాసంస్థ అధినేత మారయ్యగౌడ్, బీఆర్ఎస్ నాయకుడు దాదాన్నగారి విఠల్‌రావు పాల్గొన్నారు. పోతన్‌కర్ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు.



నగరంలో మూసి ఉన్న దుకాణాలు

ధాన్యం తూకంలో తరుగు తీస్తే చర్యలు

- జిల్లా కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

రుద్రూర్ : ధాన్యం సేకరణలో అవకతవకలు జరిగితే బాధ్యులపై కఠిన చర్యలు ఉంటాయని జిల్లా కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి హెచ్చరించారు. రుద్రూర్, పోతంగల్, కోటగిరి మండలంలోని కొత్తపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం ఆయన పరిశీలించారు. సేకరించిన ధాన్యం వివరాలు తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రాల్లో ఏర్పాట్లను పరిశీలించారు. కొన్నిసార్లు తూకం వేయకుండానే ధాన్యం నింపి పంపిస్తున్నారని రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. కొనుగోలు కేంద్రాల్లో ప్రతి ధాన్యం బస్తాను తప్పని సరిగా కాంటా చేసిన తరువాతనే మిల్లులకు తరలించాలని నిర్వాహకులకు కలెక్టర్ సూచించారు. తరుగు, కోతలను అమలు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. కొనుగోలు కేంద్రాలకు సరిపడా గన్నీ బ్యాగులు కేటాయించాలని, వర్షాలకు ధాన్యం తడిసిపోకుండా టార్పాలిన్‌లు అందుబాటులో ఉంచాలన్నారు. రైస్ మిల్లుల నుంచి ట్రక్ షీట్లు తెప్పించుకుని వేగంగా ట్యాబ్ ఎంట్రీలు చేయాలని, దీంతో సకాలంలో రైతులకు బిల్లుల చెల్లింపులు జరుగుతాయన్నారు. క్రాప్ బుకింగ్ జాబితాలో పేర్లు లేని రైతులు పంట సాగు చేస్తే క్షేత్ర స్థాయిలో పరిశీలించి సంబంధిత రైతులకు ధ్రువీకరణ పత్రాలు అందించాలని ఏఈవోలను ఆదేశించారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, జిల్లా సహకార అధికారి శ్రీనివాస్, తహసీల్దార్‌లు గంగాధర్, తారాబాయి, వ్యవసాయ అధికారులు సాయి కృష్ణ, రాజు, నిశిత ఉన్నారు.



రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

కానిస్టేబుల్ ప్రమోద్‌కు కన్నీటి వీడ్కోలు



కానిస్టేబుల్ ప్రమోద్ మృతదేహానికి నివాళులు అర్పిస్తున్న ఐజీ, సీపీ ఇన్‌సెట్‌లో ప్రమోద్ (ఫైల్)

- అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు
- నివాళులు అర్పించిన ఐజీ, సీపీ

నిజామాబాద్‌అర్బన్ : సీసీఎస్ కానిస్టేబుల్ ప్రమోద్ అంత్యక్రియలు నగరంలో శనివారం అధికారిక లాంఛనాలతో పూర్తయ్యాయి. స్థానిక రైల్వే కమాన్ ప్రాంతంలోని బ్యాంకు కాలనీలోని ఆయన నివాసం నుంచి అంతిమయాత్ర ప్రారంభమైంది. మల్టీజోన్– 1 నార్త్ తెలంగాణ ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి, సీపీ సాయిచైతన్యతో పాటు పోలీస్ అధికారులు హాజరయ్యారు. ప్రమోద్ కుటుంబానికి అండగా ఉంటామని సీపీ పేర్కొన్నారు. ప్రమోద్ పార్థివ దేహానికి నివాళులు అర్పించారు. అంతిమయాత్రలో పాడె మోశారు. ఈ సందర్భంగా ఐజీ చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ నిందితుడు రియాజ్‌ను త్వరలోనే పట్టుకుంటామన్నారు. శాంతి భద్రతల విషయంలో ఉపేక్షించబోమన్నారు.

అండగా ఉంటాం..

కానిస్టేబుల్ ప్రమోద్ కుటుంబానికి అండగా ఉంటామని సీపీ సాయి చైతన్య పేర్కొన్నారు. ఉదయం మీడియాతో మాట్లాడారు. నిందితుడు రియాజ్‌ను పట్టుకునేందుకు కానిస్టేబుల్ ప్రమోద్‌తోపాటు సీసీఐ ఎస్సై కూడా ఉన్నారన్నారు. దురదృష్టవశాత్తు పోలీసు ఫ్యామిలీలో ఒకరు చనిపోవడం చాలా బాధాకరమన్నారు. కానిస్టేబుల్ కుటుంబానికి ప్రతి ఒక్కరూ అండగా ఉండాలని, కొందరు ఘటనను రాజకీయం చేయడం తగదన్నారు.

జిల్లా కేంద్రంలోనే



జిల్లా కేంద్రంలోనే నిందితుడు రియాజ్ ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. శనివారం రాత్రి 9.30 గంటల ప్రాంతంలో సారంగపూర్ ప్రాంతంలో నిజాంసాగర్ కెనల్ వద్ద ఆచూకీ దొరికింది. నిందితుడు కెనాల్‌లో దూకడంతో గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. కాగా ఉదయం రియాజ్ తల్లిదండ్రులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

ఎనిమిది పోలీసు బృందాల గాలింపు



నిందితుడు రియాజ్ కోసం గాలిస్తున్న పోలీసులు

కానిస్టేబుల్ ప్రమోద్ హత్య కేసులో నిందితుడు రియాజ్‌ను పట్టుకునేందుకు ఎనిమిది పోలీసు బృందాలు గాలిస్తున్నాయి. శుక్రవారం బాబన్‌సాహెబ్ పహాడ్ వద్ద కెనల్ కట్ట ప్రాంతంలో మొదట రియాజ్‌ను పట్టుకునేందుకు కానిస్టేబుల్ ప్రయత్నం చేశాడు. కెనాల్ కాల్వ గుండా పారిపోతున్న రియాజ్‌ను వెంబడించి పట్టుకున్నాడు. అనంతరం తన బైక్‌పై సీసీఎస్ ఎస్సై విఠల్ ఆధ్వర్యంలో అరెస్టు చేసి బైక్‌పై తీసుకువస్తున్నారు. ఈ సందర్భంలోనే రియాజ్ కానిస్టేబుల్‌ను పొడిచి హత్య చేశారు. అతను ఎక్కడికి పారిపోయాడు. నిందితుడు రియాజ్ సెల్‌ఫోన్ వదిలేసి మరో బైక్‌ను దొంగిలించి పారిపోయినట్లు పోలీసులు భావిస్తున్నారు. అర్ధరాత్రి 12 గంటల వరకు నగరంలోనే ఉన్నట్లు పోలీసులకు సమాచారం. కొన్ని బృందాలు పట్టణంలో గాలింపు చర్యలు చేపడుతున్నాయి. మరికొన్ని బృందాలు రియాజ్ తరచుగా వెళ్లే ప్రాంతాలను జల్లెడ పడుతున్నాయి. త్వరలోనే నిందితుడిని పట్టుకుంటామని సీపీ సాయి చైతన్య అన్నారు.

నాలుగో స్తంభానికి పొంచివున్న ప్రమాదం

పత్రికాస్వేచ్ఛను కాపాడాలి



ఏపీలోని కూటమి ప్రభుత్వం అక్రమ కేసులతో జర్నలిస్టులను భయభ్రాంతులకు గురిచేయడం సరికాదు. ఇది సాక్షి పత్రికపై దాడి మాత్రమే కాదు రాజ్యాంగంపై దాడిగా పరిగణిస్తున్నాం.పత్రికా స్వేచ్ఛను కాపాడాలి. – మానాల మోహన్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు, రాష్ట్ర సహకార సంఘం లిమిటెడ్ చైర్మన్

- 'సాక్షి'పై దాడి ప్రజాస్వామ్యంపై దాడిగానే పరిగణిస్తున్నాం
- ఏపీలోని కూటమి ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలి
- రాజకీయ నేతలు, ప్రజా సంఘాలు, జర్నలిస్టు సంఘాల ప్రతినిధుల మనోభిప్రాయాలు



'సాక్షి' దినపత్రిక, ఎడిటర్ ధనంజయ రెడ్డిపై ఏపీలోని కూటమి ప్రభుత్వం అక్రమంగా కేసులు పెట్టి వేధించడాన్ని ప్రజాస్వామిక వాదులు, ప్రజాప్రతినిధులు, పలు రాజకీయ పార్టీల నేతలు ఖండించారు. పత్రికపై దాడిని ప్రజాస్వామ్యంపై దాడిగా అభివర్ణించారు. వాస్తవాలు వెలుగులోకి తెస్తూ.. ప్రజలను అప్రమత్తం చేస్తున్న 'సాక్షి' వంటి ప్రజామోదం పొందిన పత్రికను ఇబ్బందుల పాలు చేస్తే ప్రజలే గుణపాఠం చెబుతారని అన్నారు. ఏపీలోని కూటమి ప్రభుత్వాల వంటి వాటితో నాలుగో స్తంభానికి ప్రమాదం పొంచివుందన్నారు. – నిజామాబాద్ సిటీ

ప్రజా'సాక్షి'ని భయపెట్టలేరు



ప్రజా సమస్యలను వెలికితీస్తూ ప్రజామోదం పొందిన సాక్షిని ఎవరూ భయపెట్టలేరు. దశాబ్ద కాలంగా సమాజంలోని ప్రజలను చైతన్యపరుస్తూ ప్రజల మనసుల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్న పత్రిక సాక్షి. ఎడిటర్ ధనంజయరెడ్డి, రిపోర్టర్లు, ఇతర సిబ్బందిపై పెట్టిన అక్రమ కేసులను ఏపీలోని కూటమి ప్రభుత్వం వెనక్కితీసుకోవాలి. పత్రికా స్వేచ్ఛను కాపాడాలి. – వసూల శ్రీనివాస్, జిల్లా కాంగ్రెస్ ఫిషర్‌మెన్ చైర్మన్

ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు



ప్రజా సమస్యలను వెలికితీస్తూ ప్రభుత్వాలను అప్రమత్తం చేసే బృహత్తర బాధ్యతను పత్రికలు నిర్వహిస్తున్నాయి. సాక్షి పత్రిక రాసే వాస్తవాలను జీర్ణించుకోలేని ఏపీలోని అధికారపార్టీ నాయకులు అక్రమ కేసులు బనాయించడం మంచిదికాదు. ఇలాంటి చర్యలు ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు వంటివి. – తాహెర్‌బిన్ హందన్, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్

అక్రమ కేసులను ఖండిస్తున్నాం



సాక్షి దినపత్రిక ఎడిటర్ ధనంజయరెడ్డిపై అక్రమ కేసులు పెట్టి వేధించడం సరికాదు. కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోంది. ఏపీలోని అధికార పార్టీ నాయకుల చర్యను ప్రజాస్వామికవాదులు పార్టీలకతీతంగా ముక్తకంఠంతో ఖండించాలి. – కేశ వేణు, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు, నుడా చైర్మన్

పత్రికలను భయపెట్టలేరు



జర్నలిస్టులు సమాజంలోని రుగ్మతలను వెలికితీసి సమస్య పరిష్కారానికి కృషిచేస్తున్నారు. జర్నలిస్టులతోనే సమస్యలు వెలుగులోకి వస్తున్నాయి. ప్రభుత్వం సాక్షి పత్రికపై, రిపోర్టర్లపై పదే పదే కేసులు బనాయించి భయపెట్టే ప్రయత్నం చేస్తోంది. సాక్షి పత్రిక వెనుక పౌర సమాజం ఉంది. పత్రికలతో పెట్టుకున్నవారి పరిస్థితి ఏమైందో చరిత్ర చూస్తే తెలుస్తది. అక్రమ కేసులను విరమించుకోవాలి. – మునిపల్లి సాయిరెడ్డి, ఐడీసీఎంఎస్ మాజీ చైర్మన్

న్యాయస్థానాలు జోక్యం చేసుకోవాలి



కల్తీమద్యం తయారీ, విక్రయం వల్ల దెబ్బతింటున్న ప్రజల ఆరోగ్యంపై సాక్షి దినపత్రిక రాసిన కథనాలపై ఏపీలోని కూటమి ప్రభుత్వం కక్ష కట్టడం సరికాదు. ప్రభుత్వంలో జరుగుతున్న తప్పులను పత్రికలు ఎత్తిచూపినప్పుడు సరిదిద్దుకోవాలి తప్ప భయపెట్టాలనుకోవద్దు. ఏపీలోని ప్రభుత్వ ఆకృత్యాలపై కోర్టులు జోక్యం చేసుకోవాలి. పత్రికా స్వేచ్ఛను కాపాడాలి. – బాజిరెడ్డి గోవర్ధన్, మాజీ ఎమ్మెల్యే

అక్రమ కేసులు వెనక్కి తీసుకోవాలి



సాక్షి పత్రిక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై నిజాలు రాస్తే ఏపీలోని కూటమి ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టి ఇబ్బందులకు గురి చేయడం చాలా బాధాకరం. సాక్షి మీడియాపై అక్రమ కేసులు తక్షణమే వెనక్కి తీసుకోవాలి. – నీరడి రవి, బీఎస్పీ అసెంబ్లీ నియోజక వర్గ ఇన్‌చార్జి, బోధన్

పాలకులను నిలదీసే పరిస్థితి ఏర్పడుతుంది..



పత్రికలు సమాజంలో నాలుగో స్తంభం వంటివి. ప్రభుత్వాలు అక్రమ కేసులు, తనిఖీల పేరుతో బయపెట్టే ప్రయత్నం చేయడం సరికాదు. సాక్షిపై పెట్టిన అక్రమ కేసులను బేషరతుగా ఉపసంహరించుకోవాలి. లేకుంటే ప్రజలు రోడ్డుమీదకు వచ్చి పాలకులను నిలదీసే పరిస్థితి ఏర్పడుతుంది. – దండి వెంకట్, బీఎల్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు

ప్రజా సంక్షేమాన్ని వదిలేసి కక్ష సాధింపు చర్యలు



ఏపీలోని చంద్రబాబు సర్కార్ పత్రికా స్వేచ్ఛపై దాడికి పాల్పడుతోంది. ఉద్దేశపూర్వకంగానే సాక్షి మీడియాపై కక్ష సాధింపు చర్యలకు దిగుతోంది. ఇది పత్రికా స్వేచ్ఛపై జరుగుతున్న దాడి. ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేసిన కూటమి ప్రభుత్వం నిజాలు రాస్తున్న సాక్షి ఎడిటర్ ధనంజయ రెడ్డిపై అక్రమ కేసులు, విచారణ పేరుతో వేధించడం, పత్రిక కార్యాలయంలో పోలీసులు హంగామా సృష్టించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. – జి ప్రమోద్ గౌడ్, స్టేట్ కౌన్సిల్ మెంబర్, తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్

కక్ష సాధింపు చర్యలు మానుకోవాలి



ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నుంచి సాక్షి మీడియా సంస్థలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోంది. సాక్షి జర్నలిస్ట్‌ల పై అక్రమ కేసులు పెట్టి వేధింపులకు గురి చేస్తోంది. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఇలాంటి పరిణామాలు మంచివి కావు. అన్ని వర్గాల ప్రజలు, ప్రజాస్వామిక వాదులు సాక్షి మీడియాకు అండగా నిలవాలి. – పుట్ట వరదయ్య, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి, బోధన్ (ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు)

క్లుప్తంగా

బోధన్ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో 422 దరఖాస్తులు



బోధన్‌టౌన్(బోధన్): బోధన్ ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయ పరిధిలోని 18 మద్యం దుకాణాలకు శనివారం రాత్రి 10 గంటల వరకు 422 దరఖాస్తులు వచ్చినట్లు సీఐ భాస్కర్‌రావ్ తెలిపారు. ఈ నెల 23న లక్కీడ్రా నిర్వహిస్తామని, డిసెంబర్ 1 నుంచి కొత్త మద్యం దుకాణాలు ప్రారంభమవుతాయని సీఐ వెల్లడించారు.

తొమ్మిది ట్రాక్టర్లు సీజ్

రాజంపేట: మండలంలోని పెద్దాయిపల్లి గ్రామ శివారులోని గుట్ట నుంచి మొరం అక్రమ రవాణా చేస్తున్న పలువురిపై కేసు నమోదు చేసి తొమ్మిది ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఎస్సై రాజు శనివారం తెలిపారు. అనుమతి లేకుండా ఇసుక, మొరం రవాణా చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బీఎస్ఎన్ఎల్ దీపావళి బొనాంజ

నిజామాబాద్ రూరల్: భారత సంచార్ నిగం లిమిటెడ్ (బీఎస్ఎన్ఎల్) వినియోగదారులకు దీపావళి పండగ బొనాంజాను ప్రకటించిందని జిల్లా జీఎం వెంకటేశ్వర్లు తెలిపారు. ఒక్క రూపాయితోనే 30 రోజులపాటు అపరిమిత ఉచిత వాయిస్ కాల్స్, రోజుకు 2జీబీ డేటా 100 ఎస్ఎంఎస్‌లు లభిస్తాయ ని పేర్కొన్నారు. వచ్చే నెల 15వ తేదీ వరకు ఉచితంగా సిమ్‌కార్డు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ నెల 18, 19, 20 తేదీల్లో బీఎస్ఎన్ఎల్ సెల్ఫ్ కేర్ యాప్, వెబ్‌సైట్ ద్వారా రూ.100 అంతకంటే ఎక్కువ రీచార్జ్ చేసుకునే పది మందిని లక్కీడిప్ ద్వారా ఎంచుకొని ఒక్కొక్కరికి 10 గ్రాముల సిల్వర్ కాయిన్‌ను బహుమతిగా ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని బీఎస్ఎన్ఎల్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని జీఎం కోరారు.

రియాజ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలి

సుభాష్‌నగర్: కానిస్టేబుల్ ప్రమోద్‌పై కత్తితో దాడి చేసి ప్రాణాలు తీసిన నిందితుడు రియాజ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ పటేల్ కులాచారి శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ ఘటన చాలా బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమోద్ మృతి పట్ల వారి కుటుంబసభ్యులకు సంతాపం ప్రకటించారు.

కానిస్టేబుల్ హత్యపై మానాల దిగ్భ్రాంతి

నిజామాబాద్ సిటీ: చోరీ కేసులో పోలీస్ స్టేషన్‌కు తీసుకువస్తున్న కానిస్టేబుల్ ప్రమోద్‌ను నిందితుడు రియాజ్ కత్తితో పొడిచి హత్య చేసిన ఘటన తనను తీవ్రంగా దిగ్భ్రాంతికి గురిచేసిందని డీసీసీ అధ్యక్షుడు, రాష్ట్ర సహకార సంఘం లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి శ నివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఘటనకు కారకులను ఎ ట్టి పరిస్థితుల్లో ఉపేక్షించవద్దని, నిందితుడిని కఠినంగా శిక్షించాలని సీపీ సాయిచైతన్యను కోరారు. మృతుడి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

గురుకులాలపై 'ప్రత్యేక' గురి

- ఉమ్మడి జిల్లా స్పెషల్ ఆఫీసర్‌గా సోషల్ వెల్ఫేర్ డీడీ ప్రమోద్
- సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి
- ఇప్పటికే ప్రిన్సిపాళ్లతో సమావేశం
- చదువుతోపాటు మెనూ అమలుకు కసరత్తు



ధర్మారంలోని సాంఘిక సంక్షేమ గురుకుల కాలేజీ

ఖలీల్‌వాడి:సాంఘిక సంక్షేమ గురుకులాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. విద్యార్థుల, సిబ్బందితోపాటు వసతిగృహాల సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతున్నారు. అందులో భాగంగా రాష్ట్రంలోని ఉమ్మడి పది జిల్లాలకు 10 మంది ప్రత్యేకాధికారులను గురుకులాల సొసైటీ కార్యదర్శి కృష్ణ ఆదిత్య నియమించారు. ఉమ్మడి నిజామాబాద్‌కు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ప్రమోద్‌ను కేటాయించారు. దీంతో 10 రోజుల క్రితం జిల్లాకు వచ్చిన ఆయన ఉమ్మడి జిల్లా పరిధిలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలల ప్రిన్సిపాళ్లతో సమావేశమయ్యారు. కాలేజీల వారీగా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల రక్షణ చర్యలతోపాటు మెనూ ప్రకారం భోజనం అందించడం, అద్దె బిల్లుల చెల్లింపు వంటి సమస్యల పరిష్కారానికి సూచనలు చేశారు.

జిల్లాలో 11 సంక్షేమ గురుకులాలు..

జిల్లాలో 11 సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల/కళాశాలలు ఉన్నాయి. అందులో 3 బాలుర, 6 బాలికల, రెండు డిగ్రీ కాలేజీలు ఉన్నాయి. సోషల్ వెల్ఫేర్ పాఠశాల, కళాశాలల్లో 5,761 మంది, డిగ్రీ కాలేజీల్లో 864 మంది విద్యార్థులు చదువుతున్నారు. జిల్లాలోని సాంఘిక సంక్షేమ గురుకులాల్లో 267 మంది రెగ్యులర్ సిబ్బంది, 84 మంది పార్ట్ టైం, 59 మంది అవుట్ సోర్సింగ్ సిబ్బంది పనిచేస్తున్నారు.

ఉత్తీర్ణత శాతం పెంపునకు..

సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించేందుకు అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. దీంతో ప్రత్యేక తరగతుల నిర్వహణపై దృష్టిసారించారు. ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన కొత్త మెనూ ప్రకారం విద్యార్థులకు పౌష్టికాహారంతో కూడిన నాణ్యమైన భోజనం అందించే దిశగా చర్యలు చేపట్టారు. మరోవైపు సిబ్బంది బకాయి వేతనాలను ఇటీవల మంజూరు చేయగా, అద్దె భవనాలకు సంబంధించిన బిల్లులు చెల్లించేందుకు వివరాలు సేకరించారు.

నివేదిక తీసుకున్నారు..

పదిరోజుల క్రితం ప్రిన్సిపాళ్లతో ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారి రివ్యూ చేశారు. గురుకులాలకు సంబంధించిన పలు అంశాలపై నివేదిక తీసుకున్నారు. సమస్యలపై ఆరా తీశారు. సిబ్బందికి వేతనాలు మంజూరు చేశారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులు త్వరలో విడుదల చేస్తామన్నారు.

– పూర్ణచంద్రరావు, సోషల్ వెల్ఫేర్ జోనల్ అధికారి

ధ్రువపత్రాల భద్రతకు 'డిజిలాకర్'

మీ కోసం..



సదాశివనగర్(ఎల్లారెడ్డి): ప్రయాణాలు ఇతర సందర్భాల్లో చాలా మంది ఉత్తీర్ణత, ఇతర విలువైన ధ్రువపత్రాలను మరిచిపోతున్నారు. ఒక్కోసారి పోగొట్టుకున్న పత్రాలను తిరిగి పొందడం కష్టంతో కూడుకున్న పని. ఇలాంటి పరిస్థితిని అధిగమిస్తూ ఎలాంటి ధ్రువపత్రాలనైనా భద్రంగా దాచుకునేలా కేంద్ర ప్రభుత్వం కొత్త విధానాన్ని అందుబాటులోకి తెచ్చింది. అదే డిజిలాకర్.

- కాగిత రహిత పాలనను ప్రోత్సహించడంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం 2016లో ప్రారంభించిన ఈ డిజిలాకర్‌ను విద్యార్థులు, నిరుద్యోగులే కాకుండా ప్రతి ఒక్కరూ విలువైన పత్రాలను దాచుకునేందుకు బ్యాంక్ లాకర్‌గా పనిచేస్తోంది.
- డిజిటల్ విధానంలో దాచుకున్న పత్రాలను ఎక్కడైనా, ఏ సమయంలోనైనా అవసరమైనప్పుడు ఉపయోగించుకోవచ్చు.
- ఇవి వాస్తవ ధ్రువీకరణ పత్రాల మాదిరే చట్టపరంగానూ చెల్లుబాటు అవుతాయి.
- లాకర్ సహాయంతో పంపించే ఈ పత్రాలను వాటి క్యూఆర్ కోడ్ లేదా డిజిటల్ సంతకాలతో నిర్ధారణ జరుగుతుంది.
- డిజిలాకర్ ఖాతాకు ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదు.
- ఆధార్ కార్డు, దానితో అనుసంధానమైన ఫోన్ నంబర్‌తో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి.
- అనంతరం ఓటీపీతో లాగిన్ అయితే మన ఆధార్‌పై లాకర్ తెరుచుకుంటుంది.
- డ్రైవింగ్ లైసెన్స్, వాహన రిజిస్ట్రేషన్ ధ్రువపత్రాలు, విద్యార్హత ధ్రువపత్రాలు, ఆధార్, ఓటరు ఐడీ, పాన్‌కార్డు, పాస్‌పోర్టు, జనన ధ్రువపత్రాలు, విద్యార్హత ఇలా అన్ని రకాల పత్రాలను స్కాన్ చేసుకొని భద్రపరుచుకోవచ్చు.
- ఒక్కొక్కరూ ఒక జీబీ వరకు డాటా ఉపయోగించుకునే అవకాశం ఉంటుంది.

సా..గుతున్న లిఫ్ట్ నిర్మాణ పనులు!

- ఎస్సారెస్పీ బ్యాక్‌వాటర్ ఆధారంగా నిర్మాణం
- రూ.149.52 కోట్ల నిధులు మంజూరు
- రెండేళ్లు గడిచినా కొనసాగుతున్న పనులు



చిట్టాపూర్ వద్ద డీసీ నిర్మాణ పనులు

బాల్కొండ: బాల్కొండ మండలం చిట్టాపూర్, శ్రీరాంపూర్, ఆర్మూర్ మండలం సుర్బిర్యాల్, కోమన్‌పల్లి గ్రామాలకు చెందిన సుమారు 3500 ఎకరాల ఆయకట్టుకు నీరందించేందుకు చేపట్టిన ఎత్తిపోతల పనులు రెండేళ్లుగా కొనసాగుతున్నాయి. ఎస్సారెస్పీ బ్యాక్‌వాటర్ ఆధారంగా కోమన్‌పల్లి శివారులో పంపుహౌస్ నిర్మించి, సుర్బిర్యాల్, ఫత్తేపూర్, చిట్టాపూర్ వరకు పైపులైన్ ద్వారా నీటి సరఫరా చేపట్టాలని 2023 అక్టోబర్‌లో రూ. 149.52 కోట్ల నిధులను అప్పటి ప్రభుత్వం మంజూరు చేసింది. శంకుస్థాపన అనంతరం లిఫ్ట్ నిర్మాణ పనుల్లో భాగంగా కొద్దిమేర పైపులైన్ తవ్వకాలు, పైపులు వేయడం చేపట్టారు. ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ వద్ద పంపుహౌస్, జాతీయ రహదారి పక్కన డీసీ (డిస్ట్రిబ్యూటర్ చాంబర్) పనులు నెమ్మదిగా సాగుతున్నాయి. పైపులైన్‌ను పంట భూముల నుంచి వేస్తున్నారు. అయితే, వేసవిలో మాత్రమే పైపులైన్ కోసం తవ్వకాలు చేపట్టే అవకాశం ఉంది. ప్రస్తుతం యాసంగి పంటలను వేసేందుకు రైతులు నేలను సిద్ధం చేస్తున్నారు. దీంతో పైపులైన్ వేసే అవకాశం లేదు. ప్రస్తుతం కొనసాగుతున్న సిమెంట్ పనులు వేగంగా చేపడితే పంటలు చేతికొచ్చిన తర్వాత వెంటనే పైపులైన్ పనులు చేపట్టే అవకాశం ఉంటుంది. కానీ ఆ పనులు సైతం నత్తకు నడక నేర్పేలా సాగుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి లిఫ్ట్ పనులను వేగవంతం చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

పంటలు ఉండటంతోనే..

చిట్టాపూర్ ఎత్తిపోతల పథకం పైపులైన్ వేసేందుకు పంటలు అడ్డుగా ఉన్నాయి. పంటలు లేనిచోట పైపులైన్ పనులు చేపట్టాం. ఇప్పటి వరకు 1500 మీటర్ల వరకు పైపులైన్ వేశాం. ప్రస్తుతం డీసీ పనులు సాగుతున్నాయి. పనుల వేగవంతానికి చర్యలు తీసుకుంటాం.

– సురేశ్, డిప్యూటీ ఈఈ, మైనర్ ఇరిగేషన్, బాల్కొండ

నిర్లక్ష్యానికి తావిస్తే చర్యలు తప్పవు

- ఆయిల్ పామ్ సాగు లక్ష్యాన్ని సాధించాలి
- కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి



మాట్లాడుతున్న కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి

నిజామాబాద్‌అర్బన్: జిల్లాలో నిర్దేశిత లక్ష్యం మేరకు ఆయిల్ పామ్ సాగు జరిగేలా అంకిత భావంతో కృషి చేయాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి సూచించారు. జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది 3,500 ఎకరాల విస్తీర్ణంలో ఆయిల్ పామ్ సాగు చేయాలని లక్ష్యం కాగా, ఆ దిశగా రైతులను ప్రోత్సహించాలన్నారు. కలెక్టరేట్‌లో శనివారం వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులు, ఆయిల్ పామ్ నర్సరీ నిర్వాహకులైన ప్రీ యునిక్ కంపెనీ ప్రతినిధులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఆయిల్ పామ్ సాగు పురోగతిపై క్లస్టర్ల వారీగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. లక్ష్య సాధనలో వెనుకబడి ఉన్న క్లస్టర్ల అధికారుల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించడంలో విఫలమవుతున్న అధికారులపై తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఒప్పందానికి అనుగుణంగా కృషి చేయని పక్షంలో ప్రయివేటు కంపెనీపై కూడా చర్యలు తీసుకునే అంశాలను పరిశీలించాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో రైతులు ఆయిల్ పామ్ సాగు చేపట్టేలా విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని పదేపదే సూచిస్తున్నప్పటికీ ఎందుకు పురోగతి సాధించలేకపోతున్నారని ప్రశ్నించారు. సాగుకు ప్రస్తుత సమయం ఎంతో అనుకూలమని, రైతులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు, మద్దతు ధర, సు దీర్ఘకాలంపాటు ఏటేటా సమకూరే రాబడి తదితర అంశాలను వివరించాలని సూచించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జె.గోవిందు, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి శ్రీనివాస్, ప్రీ యూనిక్ కంపెనీ ప్రతినిధులు, ఆయా క్లస్టర్ల ఉద్యానవన శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఎస్‌హెచ్‌జీలకు మరిన్ని కొనుగోలు కేంద్రాలు

- సాఫీగా కొనుగోళ్లు చేపట్టడంతోనే..
- యాసంగి కన్నా ఈ సారి 37 కేంద్రాలు అధికం



మోర్తాడ్‌లో మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ప్రారంభిస్తున్న కొనుగోలు కేంద్రం

మోర్తాడ్(బాల్కొండ):మహిళా సంఘాలకు వరి ధాన్యం కొనుగోలు బాధ్యతను విస్తృతం చేశారు. గత యాసంగి సీజన్‌కన్నా ఈసారి 37 కొనుగోలు కేంద్రాలను పెంచారు. జిల్లాలోని మహిళా సంఘాలు గతంలో 224 కేంద్రాల ద్వారా వరి ధాన్యాన్ని సేకరించాయి.అయితే జిల్లా వ్యాప్తంగా ఈసారి మొత్తం 676 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయగా, అందులో మహిళా సమాఖ్యలకు 261 కేంద్రాలను అప్పగిస్తూ అధికార యంత్రాంగం నిర్ణయించింది. గ్రామ సమాఖ్యలను ఆర్థికంగా బలోపేతం చేస్తూ వారిని వ్యాపార రంగం వైపు ప్రోత్సహించేందుకు ధాన్యం కొనుగోళ్లను అప్పగిస్తున్నారు.

మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి రుణాలు ఇవ్వడ, వసూలు చేయడంతో ఆశించిన ప్రయోజనం చేకూ రడం లేదని ప్రభుత్వం భావిస్తోంది. వ్యాపారం వైపు మహిళల దృష్టిని మరలిస్తే వారు ఆర్థికంగా నిలదొక్కుకుంటారని గుర్తించిన ప్రభుత్వం వరి కొనుగోలు కేంద్రాలకు ప్రాధాన్యం కల్పించింది.

విజయవంతంగా నిర్వహించాలి

మహిళా సమాఖ్యల ఆధ్వర్యంలోని కొనుగోలు కేంద్రాల ద్వారా మహిళలు విజయవంతంగా వరి ధాన్యాన్ని సేకరించాలి. లక్ష్యానికి అనుగుణంగా వడ్లు కొనుగోలు చేసి లాభాలు గడించాలి. మహిళా సంఘాలు బలపడితేనే సభ్యులకు ప్రయోజనం.

– సాయాగౌడ్, పీడీ, గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ

22న జాబ్‌మేళా

కామారెడ్డి అర్బన్: ఈనెల 22వ తేదీన జాబ్ మే ళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధికల్పనాధికారి ఎం రజినీకిరణ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపా రు. వరుణ్ మోటార్స్‌లో ఉద్యోగాల భర్తీ కోసం బుధవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు కలెక్టరేట్‌లోని 121 నంబర్ గదిలో ఇంటర్వ్యూలు ఉంటాయని పేర్కొన్నారు. ఎంపికైన వారు నిజామాబాద్‌లో పనిచేయాల్సి ఉంటుందని, వివరాలకు 98854 53222, 76719 74009 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

రెండేళ్లకు చిక్కాడు..

- హంతకుడు మద్నూర్‌వాసి
- సిద్దిపేటలో అదుపులోకి తీసుకున్న పోలీసులు
- రిమాండ్‌కు తరలింపు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, చిత్రంలో నిందితుడు బాలాజీ

తాండూరు: హత్య చేసి పరారీలో ఉన్న నిందితుడిని రెండేళ్ల తర్వాత పోలీసులు పట్టుకున్నారు. వివరాలను డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, సీఐ నగేశ్ శనివారం విలేకరులకు వెల్లడించారు. వికారాబాద్ జిల్లా పెద్దేముల్ మండలం మన్సన్‌పల్లికి చెందిన ముడావత్ రవి(39) వ్యవసాయ పనులు చేస్తూ జీవించేవాడు. గ్రామ శివారులోని ఓ ఫామ్‌హౌస్‌లో పనిచేసే కామారెడ్డి జిల్లా మద్నూర్‌కు చెందిన బాలయ్య అలియాస్ బాలాజీతో ఇతనికి స్నేహం కుదిరింది. ఈ క్రమంలో పలుమార్లు మద్యం తాగేందుకు రవి వద్ద బాలాజీ రూ.2,050 అప్పుగా తీసుకున్నాడు. నెలలు గడుస్తున్నా తిరిగి డబ్బులు ఇవ్వకపోవడంతో పలుమార్లు అడగగా, రవి తన పరువు తీస్తున్నాడని కక్షపెంచుకున్న బాలాజీ 2023 ఆగస్టు 12న మద్యం తాగుదామంటూ తాను పనిచేసే ఫామ్ హౌస్ వద్దకు పిలిచాడు. అనంతరం పథకం ప్రకారం కత్తితో పొడిచి పారిపోయాడు. ఆస్పత్రి పాలైన బాధితుడు చికిత్స పొందుతూ ఆరు రోజుల తర్వాత మరణించాడు. దీంతో నిందితుడైన బాలాజీపై హత్య, అట్రాసిటీ కేసులు నమోదయ్యాయి. నాటి నుంచి హంతకుడి కోసం పోలీసులు వెతుకుతున్నా ఆచూకీ లభించలేదు. ఇటీవల మృతి చెందిన తన తల్లి అంత్యక్రియలకు సైతం రాలేదు. కొన్నాళ్లుగా అతని కుటుంబసభ్యుల కదలికలపై నిఘా పెట్టిన పోలీసులు, కాల్‌డాటా ఆధారంగా నిందితుడు సిద్దిపేటలోని తన సోదరుడు సంజీవ్ ఇంట్లో ఉన్నట్లు గుర్తించి, అక్కడికి వెళ్లి అరెస్టు చేశారు. హత్య అనంతరం చాలారోజులు మహారాష్ట్రలోని సాంగ్లీ జిల్లా వీసాపూర్‌లో తలదాచుకున్నాడని విచారణలో వెల్లడైనట్లు డీఎస్పీ తెలిపారు. నిందితుడిని కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించారు. కేసులో కీలకంగా పనిచేసిన పోలీసులు అంజాద్, శివకుమార్, మున్నయ్యను అభినందిస్తూ డీఎస్పీ రివార్డులు అందజేశారు.



క్రైం కార్నర్

స్కూటీని ఢీకొన్న లారీ

- రిటైర్డ్ వీఆర్వో దుర్మరణం



జనార్దన్ రావు (ఫైల్)

కామారెడ్డి క్రైం: అదుపుతప్పిన లారీ స్కూటీని ఢీకొన్న ఘటనలో ఒకరు దుర్మరణం పాలయ్యారు. ఈ ఘటన జిల్లా కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఎదురుగా శనివారం ఉదయం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని ఎన్‌జీవోస్ కాలనీకి చెందిన రిటైర్డ్ వీఆర్వో జనార్దన్ రావు వ్యక్తిగత పనుల మీద స్కూటీపై వెళ్తున్నాడు. అదే సమయంలో వెనుక నుంచి వచ్చిన లారీ అదుపుతప్పి స్కూటీని ఢీకొంది. ఈ ప్రమాదంలో జనార్దన్ రావుకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు, స్థానికులు ఆయనను జనరల్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కొద్దిసేపటికే మృతి చెందాడు. ఇసాయిపేటకు చెందిన ఆయన కొంతకాలంగా కుటుంబంతో కలిసి కామారెడ్డిలోని ఎన్జీవోస్ కాలనీలో స్థిరపడ్డారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

చేపలవేటకు వెళ్లి విద్యుత్ షాక్‌తో ఒకరు..

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని భవానీపేట గ్రామానికి చెందిన బ్యాగరి రాజయ్య(52) చేపలవేటకు వెళ్లి విద్యుత్ షాక్‌తో మృతి చెందినట్లు ఎస్సై దీపక్‌కుమార్ తెలిపారు. గ్రామశివారులోని పెద్దవాగు మడుగులో శనివారం విద్యుత్ తీగల సహాయంతో చేపలను పట్టేందుకు స్టార్టర్ బాక్సులోని ఫ్యూజ్‌కు వైరు పెట్టి నీటిలో దిగుతున్న క్రమంలో షాక్ తగిలి రాజయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. గ్రామస్తులు మృతదేహాన్ని గుర్తించి మృతుడి సోదరి లక్ష్మికి సమాచారం ఇచ్చారు. లక్ష్మి ఫిర్యాదు మేరకు ఘటనా స్థలానికి పోలీసులు చేరుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.


రోడ్డు ప్రమాదంలో యువకుడు..



స్వామి(ఫైల్)

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని పద్మాజివాడి గ్రామ శివారులోని స్ప్రింగ్ ఫీల్డ్స్ స్కూల్ సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. గాంధారి మండల కేంద్రానికి చెందిన కామెల్లి అరవింద్ స్వామి(29) సదాశివనగర్ మండల కేంద్రంలోని అత్తగారి ఇంటికి వచ్చి భార్యాపిల్లలను చూసి తిరిగి ద్విచక్ర వాహనంపై గాంధారికి వెళ్తున్నాడు. ముందు వెళ్తున్న కారును ఓవర్‌టేక్ చేసి వెళ్తూ ఎదురుగా వస్తున్న హైచర్ వ్యాన్‌ను ఢీకొట్టాడు. దీంతో తీవ్రంగా గాయపడిన స్వామిని కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించేలోగా మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి తండ్రి నర్సింహులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై పుష్పరాజ్ తెలిపారు.

చికిత్స పొందుతూ మాజీ ఎంపీటీసీ..



జంగిడి లక్ష్మి(ఫైల్)

ఇందల్వాయి: మండలంలోని తిర్మన్‌పల్లి మాజీ ఎంపీటీసీ జంగిడి లక్ష్మి(61) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మధ్యాహ్నం మృతి చెందినట్లు ఎస్సై సందీప్ తెలిపారు. 15 రోజుల క్రితం లక్ష్మి పురుగుల మందు సేవించింది. విషయం తెలిసిన ఆమె చెల్లెలు వెంటనే అక్కను చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించింది. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ లక్ష్మి శనివారం మృతి చెందారు. కాంగ్రెస్ సీనియర్ నాయకురాలైన జంగిడి లక్ష్మి మృతి పార్టీకి తీరని లోటని మండల నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

చిన్న నిర్లక్ష్యం.. భారీ మూల్యం

- ధాన్యం నూర్పిళ్లు, ఆరబోతలతో రోడ్డు ప్రమాదాలు
- గత అక్టోబర్‌లో జరిగిన ప్రమాదాల్లో 27 మంది మృతి
- అందులో ధాన్యం ఆరబోతలతో జరిగినవే ఎక్కువ
- పోలీసులు అవగాహన కల్పిస్తున్నా కనిపించని మార్పు



కామారెడ్డి క్రైం: ఒక్కోసారి చిన్నపాటి నిర్లక్ష్యానికి భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది. రోడ్లపై ధాన్యం ఆరబోతలు, నూర్పిళ్ల విషయం కూడా అలాంటిదే. ఆరుగాలం శ్రమించి దేశానికి అన్నం పెట్టే రైతన్నలకు సంబంధించిన విషయం కావడంతో అందరూ సర్దుకుపోతుంటారు. కాకపోతే రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని పోలీసుశాఖ గుర్తు చేస్తోంది. రోడ్లపై ధాన్యం ఆరబోయడంతో రోడ్డు ప్రమాదాలకు ఆస్కారం ఉంటుందని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరిస్తూ విలువైన ప్రాణాలను కాపాడుకోవాలని సూచిస్తున్నారు. గతేడాది జరిగిన ప్రమాదాలను దృష్టిలో ఉంచుకొని ఇప్పటికే పోలీసులు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. అయినా మార్పు కనిపించడం లేదు. తాజాగా తాడ్వాయి మండలం చందాపూర్‌లో ఓ వ్యక్తి బైక్‌పై వెళ్తూ రోడ్డుపై ఆరబోసిన మక్కల కారణంగా అదుపుతప్పి కిందపడి మృత్యువాత పడ్డాడు.

పోలీసుల ప్రత్యేక దృష్టి..

కామారెడ్డి జిల్లాలో ప్రతి సంవత్సరం అక్టోబర్ నాటికి వరి, మొక్కజొన్న, సోయాబీన్, పప్పు దినుసుల కోతలు పూర్తవుతాయి. చాలామంది వాటిని రహదారుల వెంట ఆరబోయడం, నూర్పిళ్లు చేస్తుంటారు. ఈ క్రమంలో అనేక రోడ్డు ప్రమాదాలు జరుగుతుంటాయి. కొంతకాలం క్రితం టేక్రియాల్ వద్ద ఓ రైతు వడ్లను రోడ్డు వెంట ఆరబోసి రాత్రిపూట రోడ్డు దాటే క్రమంలో వాహనం ఢీకొని మృతి చెందాడు. వాహనాలు అదుపుతప్పి పడిపోవడంతో సంభవించిన మరణాలు అనేకం. గత అక్టోబర్ నెలలో జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో మొత్తం 27 మంది మృతి మృతి చెందగా, అందులో ధాన్యం ఆరబోతల కారణంగా దాదాపు 10 ప్రమాదాలు జరిగినట్లు భావిస్తున్నారు. దీంతో పోలీసులు ఈ వ్యవహారంపై ప్రత్యేకంగా దృష్టి సారించారు.

అందరి బాధ్యత..

రోడ్లపై ధాన్యం నూర్పిళ్లు, ఆరబోసే విషయంలో వాహనదారులే కాకుండా రైతులు సైతం ప్రమాదాల బారినపడిన ఘటనలు ఉన్నాయి. చిన్నపాటి నిర్లక్ష్యం కారణంగా జరిగే ప్రమాదాల్లో కుటుంబ పెద్ద దిక్కయిన వ్యక్తి ప్రాణాలు కోల్పోతే ఆ కుటుంబంలో తీరని విషాదం నెలకొంటుంది. అందుకే ధాన్యాన్ని రోడ్లపై కాకుండా గ్రామాల్లోని ఖాళీ స్థలాల్లో మాత్రమే ఆరబోయాలని రైతులకు పోలీసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం..



రోడ్లపై ధాన్యం నూర్పిళ్లు, ఆరబోయడంతో ఏటా పలు రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డు ప్రమాదాల నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత. జీపీలు, రైతు సమితులు కేటాయించిన స్థలాల్లోనే పంట దిగుబడులను ఆరబోయాలి. విలువైన ప్రాణాలు రక్షించుకోవాలి.

– రాజేశ్‌చంద్ర, ఎస్పీ, కామారెడ్డి

ప్రాణం తీసిన మక్కలు

- కుప్పను తప్పించబోయి బైక్ అదుపుతప్పి ఒకరు మృతి



గంగారెడ్డి (ఫైల్)

తాడ్వాయి(ఎల్లారెడ్డి): తాడ్వాయి గ్రామ శివారులో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందినట్లు ఎస్సై నరేశ్ తెలిపారు. మండలంలోని చందాపూర్ గ్రామానికి చెందిన పైడి చిన్నగంగారెడ్డి(52) బైక్‌పై తాడ్వాయిలోని చిన్న కూతురు వద్దకు వెళుతున్నాడు. మార్గమధ్యంలో రోడ్డపై ఉన్న మక్కల కుప్పను తప్పించబోయి అదుపుతప్పి బైక్‌పై నుంచి కిందపడడంతో గంగారెడ్డి తల, ముక్కుకు తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు. గంగారెడ్డి పరిస్థితి విషమించడంతో అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గంగారెడ్డి మరణించాడు. మృతుడికి భార్య మల్లవ్వ, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. మల్లవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.